# సారం - సంసారం

"రేపు జనరల్ రజనటగదా? " అన్నాడు వెంకటి.

"ఔ శివాజీ జయంతి గదా, జనరల్ రజనే" జవాబిచ్చాడు భీమన్న

"ఐతే రేపు కోటీడంతా(గదంతా) నిండి పోతది. అందరూ ఇంట్లనే ఉంటరు గదా"

"నేనైతే కుర్లకు పోతా, మా బామ్మర్ది రమ్మని జెప్పిండు. దగ్గర దగ్గర అర్నెల్లాయె ఆల్లింటికి పోక"

"నాకోల్లున్నరు పోయెతందుకు ? పొద్దుగల్ల ఇంట్లనే ఉంట సాయంత్రం చౌ పార్టీకి పోతా"

అది వర్లి-బొంబాయిలోని ఒక చాత( బిల్డింగ్) దాంట్లో ఒక వంద చదరపు అడుగుల గది. ఓ పదిమంది మిల్లు కార్మికుల "పండే కోటీడు "(లాడ్జి) క్రింద ఆరుగురు, కట్టెచెక్కలతో వేసిన అటకపై నలుగురు పడుకుంటారు. అటకపై కూర్చోవడానికే తప్ప వంగడానికి కూడా వీలుకాదు. గదికి ఓ మూలన ఓపెన్ బాత్‌రూం. దాంట్లో ఒక కుళాయి, బాత్రూం పక్కన ఓ పెద్ద డ్రమ్ము నీళ్ళు నిలవ చేసుకోవడానికి వీలుగా ఉంది.

బొంబాయి మహానగరంలో అది కార్మిక విభాగమైన వర్లీ, పరేల్, గాయిగాం, కామారిపురాలో ఇలాంటి పండే "కొటీళ్ళు" చాలా ఉన్నాయి. వీటిల్లో వుండే వారు వేరు వేరు షిఫ్టుల్లో పని చేస్తుండటం వల్ల ఏ మూడు నాలుగు నెలలకోసారో జనరల్ సెలవు దినం ఉంటే తప్ప అందరూ ఒకసారి రూంలో ఉండరు. ఉదయం ఏడు గంటల నుండి పగలు మూడు గంటల వరకు మొదటి షిఫ్టు, మూడు గంటల నుండి పదకొండు గంటల వరకు రెండవ షిఫ్టు, పదకొండు గంటల నుండి మర్నాటి ఉదయం ఏడు గంటల వరకు

మూడవ షిఫ్టు ఉంటాయి. నెలలో ముప్పై రోజులూ మిల్లు పని చేస్తుంటే, వారంలో ఏదో ఒక రోజు వేరు వేరు కార్మికులకు సెలవు వుంటుంది.

భీమన్న, వెంకటి ఒకే "పండుకోటీడు" లోని సహవాసులు. భీమన్న బొంబాయి వచ్చి ఇరవై సంవత్సరాలకు పైగా కాగా వెంకటి మాత్రం ఆరు నెలల క్రిందటే వచ్చాడు. ఒక మిల్లులో "అప్రెంటిస్ ఏవర్"గా ఉన్నాడు. వారి మాటల్లో అద్దె ప్రసక్తి వచ్చింది.

"అచ్చే నెల నుంచి తొంబై రూపాయలు బాడిగె జేస్తరట" భీమన్న.

"అయిదు నెల్ల క్రింద పదిగేను రూపాలు బాడిగె పెంచింద్రు. మల్ల పది పెంచుతరటనా?" వెంకటి ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

"పెంచకేం జేత్తరు? దిన దినంకు ఇండ్ల ధరలు పెరుగుతున్నై. ఓల్లకన్న కట్లకు(కుటుంబం) కొటీరు(గది) బాడుగకిత్తే, యాడాదికి పన్నెండు వేలు ఇత్తున్నారు. అవి అడ్డికిచ్చుకుంటే (వడ్డీకి ఇస్తే) నెలకు రెండు మూడు నూర్లు ఎక్క దొర్కుతై. నెల నెలకు పదిమంది దగ్గర బాడిగె వసూలు జేసే తిప్పలు ఉండది. మన శేటు కావట్టి ఇన్నేండ్ల నుంచి ఇది"పండే కొటీరు" గ ఉంచిండు కట్లకు బాడిగె కియ్యలే" జవాబిచ్చాడు భీమన్న.

మెగాసిటీ బొంబాయిలో రోజుకు మూడు రూపాయలలో లాడ్జింగ్ సౌకర్యం కారు చవక కదూ !

"ఇరువై ఏండ్ల నుంచి బొంబాయిల పనిజేత్తున్నవు గదా! ఒక కొటీడన్న కొనుక్కొనలేదేమే భీమన్నా"

"నీకేం జెప్పాల తమ్మీ! కొటీడుకు ఇరవై ముప్పై వేయిలున్నప్పుడు. ఎంతో మందికొనుక్కోమన్నరు. అప్పుడువగారు (నెలజీతం) తక్కుండే, బాకీ దీసి రూం కొనేందుకు ధైర్యం రాకపోయె. ఇప్పుడేమో రెండు లక్షలకు తక్కువకు కొటీడు రాదు"

అవును ఈ రోజుల్లో వంద చదరపు అడుగుల గది కొనాలంటే రెండు మూడు లక్షల రూయలు కావాలి మరి!

"ఇన్నేండ్ల నుంచి పండే కొటీడ్లనే ఉన్నవా? ఎప్పుడన్నా మీ కట్లను తీసికొచ్చినవా?"

"ఇరవై ఏండ్ల నుంచి ఇదే కొటీడ్ల ఉన్నా. అప్పుడు నెలకు పది రూపాయలు బాడిగ ఉండే. ఇప్పుడు నూరు రూపాల దగ్గరికచ్చే. రెండు సార్లు బొంబాయి సూపిచ్చేతందుకు పిల్లలను తొలుక వచ్చినా . గణపతి పండుగప్పుడు ఒకసారి. దీలె(దీపావళి) తాతీల్లప్పుడొకసారి అచ్చి(వచ్చి) కుర్లకు మా బామ్మర్ది ఇంట్ల ఉన్నారు"

"అయితే ఇరవై ఏండ్ల నుంచి పొట్లగాల్ల దగ్గరనే తింటున్నవా?"

"ఏక్ సౌ ఆఠ్ (పర్లీ బి.డి.డి. చాల్ నెం.108) ల సాయెల మల్లక్క దగ్గర ఎనిమిదేండ్లు తిన్న ఆమె కాలం జేసినంక పన్నెండేండ్ల నుంచి ఏక్ సౌ పాంచ్(105)ల మల్లాల ముత్తెమ్మ ఇంట్ల దింటున్న అదే అలవాటయింది. అచ్చే నెలనుంచి పొట్టకు గూడా నన్నూట డెబ్బై అయిదు సెత్తరట."

ఒంటరిగా ఉంటూ, మిల్లులోనో, ఫ్యాక్టరీలోనో, టైలర్ గానో పనిచేసే కార్మికులు, పొట్టగాళ్ళ (పూటకూళ్ళమ్మల) దగ్గర భోజనం చేస్తారు. ఒక్కో పూటకూళ్ళమ్మ దగ్గర, ముప్పై నుండి ఎనభై మంది వరకు భోంచేస్తారు. రెండు పూటలా కడుపు నిండా భోజనానికి, నెలకు నాలుగు వందల రూపాయల నుండి అయిదు వందల వరకు తీసుకుంటారు. తీసుకొనే చార్జిని బట్టి వారంలో రెండు రోజుల నుండి నాలుగు రోజులు మాంసాహారం పెడతారు. ఈ పొట్టగాళ్ళు కార్మికుల పాలిటి అన్నపూర్ణలు. ఈ రోజుల్లో కూడా బొంబాయి లాంటి మహానగరంలో పూటకు ఎనిమిది రూపాలలో అన్నం పెడుతున్నారంటే వారు సాక్షాత్తూ "అన్నపూర్ణాదేవి" అవతారాలు కాదంటారా? అదే హోటల్లో అయితే ముప్పై రూపాయల ఖర్చు చేసినా కడుపు నిండా భోజనం దొరకదు.

"పొట్టగాళ్ళ దగ్గర తిని, తిని యాష్ట ర్రాలేదా? పిల్లగాండ్లను దేశంల ఉంచి, ఇన్నేండ్ల నుంచి ఒక్కడే ఎట్లుంటున్నౌ? దేశంల మీ వోల్లు ఎట్లుంటున్నరు?" తన ప్రశ్నల పరంపరను కొనసాగించాడు వెంకటి.

"ఏం జెయ్యాల, నశీబు మాట. పది నెలలు బొంబాయిల పనిజేయాలి, రెండు నెలలు దేశంల ఉండి రావాల. ఈ జిందగీ ఇట్లనే గడిసే. వయసు మీద పిల్లగాండ్లను తోలకచ్చుకుందమంటే ఈడ కొటీడు లేకపోయె. ఆడ ముసలోల్లను సూసె టోల్లు లేకు పోయిరి. ఇప్పుడు ముసలోల్లు పోయిండ్రు కాని కొటీరు కొనే తందుకు శాత (చేత) గాదు."

"నాతో నైతే ఇట్లుండుడు గాదు. ఆర్నెల్లకే యాష్టకత్తున్నాది. బదిలి పాసు (టెంపరరీ పాసు) పుట్టగనే, బై టూర్ల రూం జూసుకొని కట్లను తీసుకత్త". మిల్లులుండే విభాగంలో కాక దాదాపు పదిహేను ఇరవై కిలో మీటర్ల దూరంలోని నగర శివార్లలో అయితే ఇంటికి అద్దె కాస్త తక్కువగా ఉంటుంది. కాని రాను పోను మూడు నాలుగు గంటలు సబర్బన్ రైళ్ళల్లో ప్రయాణం చేయాలి.

ఒక సుఖం రావాలంటే వేరొక అసౌకర్యం తప్పదు. ఆ సంభాషణ అంతటితో ఆపి భీమన్న ఏదో పని మీద బయలుదేరాడు.

బాగా ప్రొద్దు పోయాక, కాస్త మంచి తీర్థం ( వారుణి వాహిని లాంటి ఇక్కడి ప్రభుత్వ సారా) పుచ్చుకుని భోంచేసి వచ్చాడు భీమన్న. పడుకున్నాడు కాని నిద్ర రావడం లేదు. వెంకటి మాటలు పదే పదే జ్ఞాపకం వస్తున్నాయి.

అవును, ఇన్నేండ్ల నుంచి తాను ఎలాంటి జీవితం గడిపాడు ? ఈనాడు వెంకటిలో ఉన్న ఆలోచన తనకు ఆనాడు ఉండి ఉంటే, తన కుటుంబం ఇలా అయేది కాదు కదా ?... పెళ్ళైన తన పెద్ద కూతురు ఇప్పుడు ఇంటి మీదే ఉంది. హడావిడిగా, వివరాలు కనుక్కోకుండా, బంధువుల ప్రోద్బలంతో చేసిన పెళ్ళి ఇప్పుడు విడాకులకు దారి తీసేదిగా ఉంది. అల్లుడు వ్యసన లోలుడే కాదు, పని దొంగ కూడా. అంతే కాదు, తన కూతురు బీడీలు చేసి గుట్టుగా సంసారం వెళ్ళ దీస్తున్నా, తిట్టి, కొట్టి హింసించే మూర్ఖుడు.

ఇక కొడుకులు ? పెద్ద వాడికి పద్దెనిమిదేళ్ళొచ్చినా బాధ్యత అనేది తెలీదు. ఇంటర్ లో

రెండుసార్లు తప్పాడు. మళ్ళీ పరీక్షలకు కూర్చోకుండా జులాయిగా తిరుగుతున్నాడు. చిన్నవాడు ఈ సారి పదవ తరగతి ఫెయిలయ్యాడు. తాను ఇక్కడ, వాళ్ళు అక్కడ. తల్లి అంటే భక్తి, భయం లేదు. వారిని అదుపులో పెట్టే వారు లేక పోయారు.

తాను అష్టకష్టాలు పడి ఊర్లో మంచి ఇల్లు కట్టాడు, భార్యకు కూతురుకు ఇరవై తులాల బంగారం నగలు చేయించాడు. రెండెకరాల పొలం కూడా కొన్నాడు. కాని తనకు సుఖమనేది ఉందా ? ఇదేనా సంసార సారం?

మిల్లులో పని చేయడం, పండే కొటీడులో పడుకోవడం పొట్టగాళ్ళ దగ్గర భోజనం. పది నెలలు బొంబాయిలో, రెండు నెలలు ఊరిలో, ఇలా గానుగెద్దు జీవితం గడపడం వల్ల ఏం సాధించాడు? ఇక్కడ తన కష్టసుఖాలు పంచుకోవడానికెవరూ లేరు. వీవరు నుండి జాబర్ ప్రమోషన్ వచ్చినపుడు తనకు ఎంత ఆనందం కల్గిందని! తోటి వారు ఎందరు అభినందించినా తన భార్యా పిల్లలతో పంచుకునే ఆనందానుభూతికి సాటిరాదు కదా! జబ్బు పడి పడకేస్తే సేవ చేసే ఆప్తులేరి? ఎంత సహవాసులైనా తన భార్యా బిడ్డలు చూపే ఆప్యాయత, ఆదరణ చూపలేరు కదా?

ఇలా ఆలోచనలతో భీమన్న మనసు భారమైంది. తనకు తెలీకుండానే కళ్ళ నుంచి నీళ్ళు కారుతున్నాయి. అంతర్మథనం ఆగడం లేదు.

ఈ మధ్య తన ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే ఉంది. కాస్త పని ఎక్కువైతే అలసటగా ఉంటోంది. ఉబ్బసంగా ఉంటోంది. బ్లడ్ ప్రెషర్ పెరుగుతోంది. ఇలా ఎన్నాళ్ళు తను పని చేయాలి?

ఉద్యోగానికి రాజీనామా ఇస్తే లక్ష రూపాయల పైనే వస్తుంది. కొంత డబ్బు బ్యాంకులో వేసి, మిగితా డబ్బుతో తన ఊరిలో ఏ చిన్న వ్యాపారం చేసినా ఖర్చులకు గడవక పోదు. పొలం నుండి వచ్చే వడ్లు ఎలాగూ భోజనానికి సరిపోతాయి

అవును, అలానే చేయాలి!

ఇంత వరకూ డబ్బు పంపి చేతులు దులుపుకున్న తాను, ఇంటికి నిజమైన కర్తగా ప్రవర్తించాలి. ఒక డబ్బు సంపాదించే మిషనులా కాక, అనుభూతులు, అనురాగాలు పంచుకునే ఆప్తుడిగా రూపొందాలి. తన కూతురు కాపురం నిలబెట్టాలి. వక్ర మార్గాన పడ్డ తన కొడుకులను దారి మళ్ళించాలి. వారికి సరైన మార్గం చూపించాలి. అప్పుడే తన జన్మ సార్ధకం అవుతుంది.

ఇలా అనుకోగానే భీమన్న మనసు కుదుట పడింది. ఆ తర్వాత అతను హాయిగా నిద్ర పోగలిగాడు.

రాత్రి తను తీసుకున్న నిర్ణయం, భీమన్న అమలు పరిచాడంటారా? నెలకు నాలుగు వేల జీతం వచ్చే ఉద్యోగం, అతను వదులుకున్నాడంటారా? లేక సారా నిషాలో తీసుకున్న నిర్ణయం, ఆ మైకం దిగి పోగానే వీగిపోయిందంటారా? జవాబు లేని, రాని ప్రశ్నలు ఇవి!★